# రబీసాగుపైనే ఆశలు

- పొలాలను బాగు చేసుకుంటున్న రైతులు
- ఖరీఫ్ మిగిల్చిన నష్టాన్ని పూడ్చుకునేందుకు యత్నాలు

**పెనుగంచిప్రోలు:** ఖరీఫ్ సీజన్ ముగుస్తుండటంతో అన్నదాతలు రబీసాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, మునేరుకు సంభవించిన వరదలు రైతులకు తీరనినష్టం మిగల్చడంతో రబీసాగుపై ఆశలుపెట్టుకున్నారు. మునేరు వరదలకు పెనుంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో తువ్వకాలువ తెగి భారీగా గండ్లు పడ్డాయి. మాగాణి పొలాలు కోతకు గురయ్యాయి. సాగుచేసిన పంట వరదకు కొట్టుకుపోవడంతో పొలాలన్నీ ఇసుక మేట వేశాయి. నేటికీ పొలాల్లో వరద నీరు నిల్వ ఉంది. కొన్ని పొలాలు నామరూపాలు కోల్పోయాయి.

**ఇసుక మేటకు అందని పరిహారం..**

వరదలకు వత్సవాయి మండలంలోని 275 మంది రైతులకు చెందిన 117.7 హెక్టార్లు, పెనుగంచిప్రోలు మండలంలోని 196మంది రైతులకు చెందిన 125.3 హెక్టార్ల సాగుభూముల్లో ఇసుక మేట మేసింది. వత్సవాయి మండలంలో ఐదుగురు రైతులకు చెందిన 2.0 హెక్టార్లు, పెనుగంచిప్రోలు మండలంలో ఇద్దరు రైతులకు చెందిన 0.6 హెక్టార్లలోని పంటపొలాలు కోతకు గురై రైతులకు తీరనినష్టం వాటిల్లింది. ఇసుక మేట, భూమి కోతకు గురైన నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ నేటివరకు బాధిత రైతులకు పరిహారం అందలేదు.

**దోజర్లతో పొలం చదును పనులు..**

ఖరీఫ్ సాగులో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టాన్ని రబీలో అయినా పూడ్చుకునేందుకు రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు ట్రాక్టర్లు, డ్రోజర్లు పెట్టుకుని ఇసుక మేట తీసుకోవటంతోపాటు కోత భూములను సరిచేసుకుంటున్నారు. పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో నిల్వ ఉన్న వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతున్నారు. వర్షాలు వరద కారణంగా దెబ్బ తిన్న పొలాలను తిరిగి సాగుకు అనుకూలంగా సిద్ధం చేసుకునేందుకు వ్యయ,ప్రయాసలు తప్పడం లేదని బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



డ్రోజర్ సాయంతో అనిగండ్లపాడు వద్ద భూమిని చదును చేస్తున్న రైతు



పొలంలో ఇసుక మేటను తొలగించి కట్టగా పోసుకున్న వైనం



పెనుగంచిప్రోలు వద్ద తువ్వకాలువ గండికి మట్టితో అడ్డుకట్ట వేసిన దృశ్యం

## పొలం బాగు చేసుకుంటున్నాం



మునేరు వరదలకు తువ్వకాలువకు గండ్లు పడి పొలమంతా కోతకు గురైంది. గత ఏడాదితోపాటు ఈ ఏడాది ఖరీఫ్ అంతా పంట నష్టపోయాం. రబీలో అయినా సాగు చేపడదామని డ్రోజర్ ద్వారా పొలంలో ఇసుక మేట తొలగించుకుని భూములు సరిచేసుకుంటున్నాం.

– కోలా రామారావు, రైతు, అనిగండ్లపాడు

## అదనపు ఖర్చులు పెరిగాయి



వరదలకు పొలాల్లో ఇసుక పెద్దఎత్తున మేట వేసింది. ఇప్పటికే పంట నష్టపోయిన రైతులకు పొలాలు బాగు చేసుకోవడం తలకు మించిన భారమైంది. రబీలో పంట వేసుకుందామనే ఆశతో ఉన్నాం. రబీసాగుకు ప్రభుత్వం కూడా చేయూతనిచ్చి సహకరించాలి.

– చుంచు భూషణం, రైతు, పెనుగంచిప్రోలు

**రబీ కలిసొస్తుందని ఆశతో...**

ఖరీఫ్‌లో ఎటూ ష్టపోయాం..తిండిగింజల కోసమైనా రబీ సాగు చేపడదామని రైతులు ఆశతో ఉన్నారు. రబీలో అయినా ప్రకృతి సహకరించాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం కూడా చేయూతనందిస్తే ఖరీఫ్ నష్టాల ఊబి నుంచి బయటపడతామని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

# జ్యోతిరావు పూలేకు ఘననివాళి



పేటలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు



నందిగామలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

**జగ్గయ్యపేట అర్బన్:** సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తికి అనుగుణంగానే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. పట్టణంలోని విజయవాడ రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయసాధనే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనను కొనసాగించారన్నారు. వెనుకబడిన కులాల సామాజిక న్యాయం కోసం పూలే విశేషంగా కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దూనాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధానకార్యదర్శి జుబేర్, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, విజయవాడ కనకదుర్గ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, న్యాయవాది బూడిద నరసింహారావు, సర్పంచ్ సూరిబాబు, నాయకులు వెంకయ్య, వేముల విజయ్, హుస్సేన్, పింగళి నరసింహారెడ్డి, మన్నె అప్పారావు, గంగోలు వినోద్, రమేష్, ఉపేందర్‌రెడ్డి, నాగబాబు పాల్గొన్నారు.

**టీడీపీ ఆధ్వర్యంలో..**

సమాజంలో కులపరమైన వివక్షతను, అన్యాయాలను రూపుమాపడగానికి, మహిళల హక్కుల పరిరక్షణకు తన జీవితాన్ని ధారపోసిన మహామనిషి మహాత్మా జ్యోతిరావు పూలే అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని కమలాసెంటర్‌లోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే తాతయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, కట్టా నరసింహారావు, కొటారు సత్యనారాయణప్రసాద్, దూళిపాళ్ల లక్ష్మణరావు, బుజ్జిబాబు, గొట్టె నాగరాజు, వెంకట్, కావేటి కోటి పాల్గొన్నారు.

**బీసీ సంఘం ఆధ్వర్యంలో..**

బీసీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. విజయవాడ రోడ్డులోని పూలే విగ్రహానికి సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు, న్యాయవాది మెట్టెల ఆంజనేయులు, బీసీ నేతలు పచ్చిపాల నాగేశ్వరరావు, దేవరకొండ శ్రీనివాసరావు, పోలంపల్లి రాధమ్మ, పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జనసేన ఆధ్వర్యంలో..**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. కమలా సెంటర్‌లోని పూలే విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పెనుగంచిప్రోలు దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు షేక్ సత్తార్, బీసీ నాయకులు ఆవాల భవానీప్రసాద్, పిచ్చయ్య, కౌన్సిలర్ కాటగాని నరసింహారావు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**బీఎస్పీ ఆధ్వర్యంలో..**

స్థానిక కమలా సెంటర్‌లోని పూలే విగ్రహానికి బీఎస్పీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మొదటివ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, బీసీ నాయకులు పెంటి శ్రీనివాసరావు, డీఎస్టీ నాయకులు గోరంట్ల శ్రీను, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కేవీ.రత్నం, మహిళా అధ్యక్షురాలు అమృతమ్మ పాల్గొన్నారు.



పేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు



పేటలో పూలేకు నివాళులర్పిస్తున్న కొదమల ప్రభుదాస్, నాయకులు

**పెనుగంచిప్రోలులో..**

**పెనుగంచిప్రోలు:** స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద పూలే విగ్రహానికి బీసీ నాయకులు కల్లూరి శ్రీవాణి, బ్రహ్మం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళల విముక్తికి పూలే విశేషంగా కృషిచేశారన్నారు. నాయకులు ముండ్లపాటి రాము, శివ, రమేష్‌బాబు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

**నందిగామలో..**

**నందిగామటౌన్:** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే సౌమ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా అట్టడుగువర్గాలకు విద్యనందించేందుకు ఆయన ఎనలేని కృషి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి పాలనంతా అరాచకమే

తన్నీరు నాగేశ్వరరావు

**జగ్గయ్యపేట అర్బన్:** కూటమి ప్రభుత్వ ఆరునెలల పాలనంతా వేధింపులు, అరాచకంగానే సాగిందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలో గురువారం పూలేకు నివాళులర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నిత్యం గత ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం, కక్ష సాధింపు చర్యలు తప్ప పరిపాలనపై దృష్టి సారించి ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో శ్రద్ధ చూపించడంలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి చివరికి రాష్ట్రంలోని 2.60లక్షల మంది వలంటీర్లను ప్రక్కన పెట్టేశారని తెలిపారు. ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 15వేల మందిని తొలగించారని గుర్తుచేశారు. మెగా డీఎస్సీ షెడ్యూలు కూడా ప్రకటించలేదన్నారు. అసలు అమలులోకే రాని ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు రుణం ఇప్పిస్తామని కేంద్రం హామీ ఇవ్వడాన్ని గొప్పగా ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు రూ.10 వేల కోట్ల రుణం తీసుకున్నట్లు చెప్తారన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కట్టకపోవడంతో విద్యార్థులను కళాశాలలకు రానివ్వడంలేదన్నారు. చదువు పూర్తయిన వారికి బకాయిలు కడితేకాని సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, దీంతో రాష్ట్రంలో 11లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2300 కోట్లు చెల్లించి పేదలకు వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. సంపద సృష్టిస్తామంటే అప్పులు చేయడమేనా అని ప్రశ్నించారు. కొత్త మెడికల్ కళాశాలలతోపాటు 3 పోర్టుల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. పేరుకే ఉచిత ఇసుక సీనరేజ్ రద్దు అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రవాణా చార్జీలు, స్థానిక నేతల కప్పం ఇవన్నీ కలుపుకుంటే గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతమే ఇసుకను ఎక్కువ ధరకు కొనాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అని ప్రచారం చేసి అవేబ్రాండ్లు, అవే ధరలకు అమ్ముతున్నారన్నారు. ఇక్కడ బెల్టుషాపుల్లో రూ.99కి అమ్ముతున్న మద్యం, ఇతర రాష్ట్రాల్లో రూ.80కే లభ్యమవుతోందన్నారు. ఇది మరో రకం దోపిడీ అని పేర్కొన్నారు. ఇలా కూటమి ప్రభుత్వ ఆరునెలల పాలన అంతా అరాచకంగా సాగుతోందని తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు.

## బెల్టుషాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు

**జుజ్జూరు(వీరులపాడు):** మద్యం అక్రమ విక్రయాలు చేసినా, అక్రమ రవాణా సాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ అక్రపున్నిసా బేగం హెచ్చరించారు. జుజ్జూరు గ్రామంలోని మద్యం దుకాణాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె ఆమె మాట్లాడుతూ బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మద్యం దుకాణం యజమానిని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయాలు సాగించాలన్నారు. మద్యం అమ్మకాల్లో నిబంధనలను పాటించాల్సిందేనని నిర్వాహకులకు స్పష్టం చేశారు.

## చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

**కంచికచర్ల:** మండలంలోని గండేపల్లి చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారిన వైనం 'సంపద కాదు.. చెత్తే మిగిలింది' శీర్షికన 'సాక్షి' దిన పత్రిక ప్రచురించిన కథనానికి ఈఓపీఆర్డీ స్పందించారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ గండేపల్లిలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో దెబ్బతిన్న తొట్లకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలని గ్రామ సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గండేపల్లిలో చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

## వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి : సీఐటీయూ



**కంచికచర్ల:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఇచ్చిన మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కంచికచర్ల ఏపీఎన్జీఓస్ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, తీరా అధికారం చేపట్టాక వారిని పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వానికి తగదని విమర్శించారు. వలంటీర్ల సమస్యను చర్చించేందుకు శనివారం ఉదయం పదిగంటలకు అన్ని గ్రామాల వలంటీర్లతో కంచికచర్ల ఏపీఎన్జీఓస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని వలంటీర్లంతా హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.సోమేశ్వరరావు, వలంటీర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నందీశ్వరునికి అభిషేకాలు



**జగ్గయ్యపేట:** కార్తికమాసం సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణబజార్‌లో వేంచేసియున్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈసందర్భంగా పలురకాల పుష్పాలు, తులసీ, మారేడు దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అవగాహన



**చిల్లకల్లు(జగ్గయ్యపేట):** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని జిల్లా మలేరియా అధికారి మోతిబాబు సూచించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూదవరం ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల్లో రక్తహీనత కారణంగా ఎన్నో ఇబ్బందులుంటాయన్నారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కుక్క దాడి-బాలుడికి స్వల్పగాయాలు



**పెనుగంచిప్రోలు:** స్థానిక తుఫాన్ కాలనీలో కుక్క దాడి చేయడంతో ఓ బాలుడికి స్వల్ప గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన జుజ్జూరి గోపి మూడేళ్ల కుమారుడు ఆర్యభూషణ్ రోడ్డుపై ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి కంటి కింద, ఛాతిపై గాయపరిచింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించారు. స్వల్ప గాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

### నూతన బస్సు సర్వీసులు ప్రారంభం



**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేట ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నూతన సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ జగ్గయ్యపేట-బెంగుళూరు-అరుణాచలం మార్గంలో నడిచే బస్సులు 15లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించడంతో ఆ బస్సుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిపో మేనేజర్ రఘురాం మాట్లాడుతూ ఓ బస్సు ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు జగ్గయ్యపేట నుంచి బయలుదేరుతుందన్నారు. మరోబస్సు అరుణాచలం నుంచి బెంగుళూరు మీదుగా జగ్గయ్యపేటకు బయలుదేరుతుందని వివరించారు.

### వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో త్రయోదశిని పురస్కరించుకొని నందీశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కార్తీక నక్షత్రదీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా అమ్మవారు శ్రీమహిషాసురమర్ధినీదేవిగా భక్తులకు దర్శనమిచారు. అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి, కుంకుమార్చన చేశారు. మల్లేశ్వరునికి పంచ హరతులు, వేదస్వస్తి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకాలు చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వణాధికారి నటరాజన్ షణ్ముగం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### సర్పంచ్‌కు మాజీఎమ్మెల్యే పరామర్శ



**నందిగామటౌన్:** మాతృవియోగంతో బాధపడుతున్న చందర్లపాడు మండలం మునగాలపల్లి గ్రామసర్పంచ్ గంగూరి వెంకటేశ్వరరావును నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు గురువారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు మాతృమూర్తి అంజమ్మ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాతృసమానులు అంజమ్మ మృతి జీర్ణించుకోలేనిదని పేర్కొన్నారు. సర్పంచ్ వెంకటేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శామ్యూల్ వరప్రసాద్‌కు నివాళి...**

**నందిగామటౌన్:** సీఎస్ఐ చర్చి డీనరీ మాజీచైర్మన్, దైవజనులు పరసా శామ్యూల్ వరప్రసాద్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. శామ్యూల్ వరప్రసాద్ మృతదేహాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామ్యూల్ వరప్రసాద్ మృతి తమను కలిచి వేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం శామ్యూల్‌వరప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**నందిగామటౌన్:** మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణబాబు గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి అధ్యక్షతన పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవనంలో ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

**రేపు జగ్గయ్యపేట సమావేశం..**

**జగ్గయ్యపేటఅర్బన్:** పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

### గోశాలకు గడ్డి వితరణ



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవులకు గురువారం గ్రామానికి చెందిన రైతు చుంచు బెనర్జీ రూ.10వేల విలువైన ఎండుగడ్డిని వితరణగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ గోవులకు దాతలు దాణా అందజేయడం అభినందనీయమన్నారు. భక్తులు విరివిగా గడ్డి, దాణా అందజేయాలని కోరారు.

### అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం విజయవాడకు చెందిన శ్రీకైవల్యకృతి సంగీత నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్యాలయానికి చెందిన గురువు శ్రీపార్దు నేతృత్వంలో 19మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్యప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. చిన్నారులకు ఆలయ ఈవో రామరావు, డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేసి అభినందించారు.